క్లుప్తంగా

శ్రీమఠంలో కర్ణాటక పీఠాధిపతులు



మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులతో కర్ణాటక పీఠాధిపతులు

మంత్రాలయం : శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటకలోని ఉరవకొండ గవి మఠం ఉత్తరాధికారి కళ్యాణ మహాస్వామి, విజయనగర నందీపుర పీఠాధిపతి మహేశ్వర స్వామి మంత్రాలయం వచ్చారు. గురువారం ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్ర స్వామి మూలబృందావనానిన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అనంతరం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులను కలిసి గౌరవ సన్మానం పొందారు.

దర్గాకు తరలివచ్చిన భక్తులు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: స్థానిక జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్తలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

నిబంధనలు పాటించాలి

కోసిగి: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంఈఓ కె. నాగేశప్ప హెచ్చరించారు. గురువారం స్థానిక శ్రీ చౌడేశ్వరి దేవి ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిలబస్ ప్రకారం బోధిస్తున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి హెచ్‌ఎం కృష్ణమూర్తిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కోసిగి కడపాళెం వీధిలో ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనం, నాడు–నేడు పనులను పరిశీలించారు.

అయోధ్య అక్షితలు ప్రతి ఇంటికీ అందిస్తాం

ఆదోనిఅర్బన్: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షితలను శాస్త్రోక్తంగా పూజించి పట్టణంలోని ప్రతి ఇంటికీ చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విశ్వహిందూ పరిషత్, హిందూ ధార్మిక సంస్థ సభ్యులు తెలిపారు. గురువారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో వారు అయోధ్య నుంచి వచ్చిన అక్షితల పంపిణీపై చర్చించారు. నగరేశ్వర దేవస్థానం పాలకమండలి సభ్యులు, ప్రెసిడెంట్ వి.టి.ప్రకాష్, కాలేపల్లి విశ్వనాథ్, కొట్రేట వేణుగోపాల్, ప్రతాప్, ఈరన్నశెట్టి, విశ్వహిందూ పరిషత్ నగర అధ్యక్షులు సాకరే ఈరన్నరావు, ఉపాధ్యక్షులు మరియాని చెన్నబసప్ప పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణ ప్రారంభం

కౌతాళం: మహిళలకు ఉచిత టైలరింగ్, ఎంబ్రాయిడరీల శిక్షణ ఒక వరంలాంటిదని కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, ఎంపీడీఓ సుబ్బారాజు, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మారుతిమోహన్ పేర్కొన్నారు. ఎకల్ గ్రామోర్ధన్ వారి సహకారంతో గురువారం కౌతాళంలో మారుతీమోహన్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ట్రస్టుసభ్యులు రామలింగప్ప, అరుణకుమారి పాల్గొన్నారు.

చెకుముకి పోటీలు

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి పోటీలను హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ సమక్షంలో నిర్వహించారు. గురువారం పాఠశాల ఆవరణలో మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య ఆవిష్కరించారు. గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సబ్‌కలెక్టర్‌ను కలిసిన నాయకులు



శివనారాయణశర్మను సన్మానిస్తున్న నాయకులు

ఆదోనిఅర్బన్: ఆదోని డివిజన్ సబ్‌కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శివనారాయణశర్మని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎరుకల రాజు, ఎరుకల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ఎరుకల కృష్ణ, ఆదోని అధ్యక్షులు రవికుమార్, మంత్రాలయం, ఎమ్మిగనూరు అధ్యక్షులు బజారి, ఈరన్న, కృష్ణమూర్తి తదితరులు స్థానిక కార్యాలయలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



కుంబళనూరు క్యాంపులో సంబరాలు



బదినేహాల్‌లో..



కౌతాళంలో కేక్ కట్ చేస్తున్న వైస్సార్‌సీపీ నాయకులు



పెద్దకడబూరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



పెద్దకడబూరులో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సంక్షేమ సారథికి అభిమాన హారతి

- వాడవాడలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, అభిమానులు, ప్రజలు
- ఆదోనిలో పండుగ వాతావరణంలో సంబరాలు



కేక్ కట్ చేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి



మంత్రాలయంలో విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి



కోసిగిలో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోనిటౌన్: సంక్షేమ పథకాల రూపకర్త సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదినాన్ని ఆదోని నియోజకవర్గంతో గురువారం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సంబరంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ నాయకులతో కలిసి భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. హామీలు నెరవేర్చడం, సంక్షేమ పథకాల అమలు, పారదర్శక పాలన,సచివాలయ, వలంటీర్ వ్యవస్థ, అభివృద్ధి పనులతో దేశంలో ఆదర్శంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. ఇంత సంక్షేమాభివృద్ధి జరుగుతున్నా విపక్షాలకు కనిపించడం లేదని, బురద జల్లే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించుకొని సంక్షేమ రాజ్యాన్ని కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. పట్టణంలోని 42 వార్డుల్లో కౌన్సిలర్లు, సచివాలయ ఉద్యోగులు కేక్ కట్ చేసి పంచుకున్నారు. 8వ వార్డులో వైస్ చైర్మన్ నరసింహులు, 36వ వార్డు, 33వ వార్డు నిజాముద్దీన్ కాలనీలో జేసీఎస్ కన్వీనర్ ఫయాజ్ అహ్మద్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, పార్టీ నాయకులు రహీం, సద్దాం, నజీర్, అమాన్, మల్లికవ్వ,సన్నీ, తిమ్మప్ప, శ్రీదేవి, అనురాధ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకుందామని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గురువారం నాయకులు, కార్యకర్తల నడుమ కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంఈఓ సువర్ణల సునియం ఆధ్వర్యంలో విద్యార్థుల చేత కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. 172 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ విజయేంద్రరెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ రఘురాముడు, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముక్కరన్న, నాయకులు రవిచంద్రరెడ్డి అర్లప్ప పాల్గొన్నారు.

కౌతాళం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను మండలంలో గురువారం సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో దేశాయిసేవ సమితి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ప్రహ్లాదాచారి ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేశారు. సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం, ఉరుకుంద ట్రస్టుబోర్డు డైరెక్టర్ వెంకోబ, నాయకులు భీమేష్, వెంకటరామరాజు, అబ్దుల్‌సమద్, మాజీ ఎంపీటీసీ చౌదరిబసవ, పూజారిలింగ, వడ్డె రామాంజినేయులు, ఉశేని పాల్గొన్నారు. అలాగే బదినేహాల్ గ్రామంలోసీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్, కుంబళనూరు క్యాంపులో ఇన్‌చార్జి అనిల్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు.

కోసిగి: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నారికేలలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి నాయకులు, అభిమానులు, కార్యకర్తల మధ్య పాలాభిషకం చేశారు. భారీ కేక్‌ను కట్ చేసి జగనన్నకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ ఈరన్న, ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడు నాడుగేని నరసింహులు, మంగమ్మ, నాడుగేని నాగరాజు, మాణిక్యరాజు,కోసిగయ్య, బుల్లి నరసింహులు, జగదీష్ స్వామి, గానిగ వీరస్వామి, షౌకత్ ఆలి, కాంట్రాక్టర్ నాగరాజు, చింతకుంట ఈరన్న, లంకారెడ్డి, ఐరన్‌గల్లు రామాంజనేయులు, నేలకోసిగి లక్ష్మన్న, సోషల్ మీడియా వారియర్స్ లోకారెడ్డి, సునంద రాజు, యూసుఫ్, వలంటీర్లు పాల్గొన్నారు.

మంత్రాలయం : మండల కేంద్రం మంత్రాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ముందుగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వరాథ్ రెడ్డిలతో కలిసి కార్యకర్తలు, అభిమానులు ప్రధాన రోడ్డు వెంబడి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగనన్న ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలంటూ పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు , విద్యార్థినులకు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో ట్యాబ్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. టీడీపీ నాయకులు ట్యాబ్‌ల పై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండించారు. అంతకుముందు తుంగభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుగోపాల్ రాజ్, కిరణ్, ఎంఈఓలు మొయినుద్దీన్, రాఘన్న, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, సచివాలయ కో కన్వీనర్ రాఘవేంద్ర చారి, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆడుదాం–ఆంధ్ర పోటీలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఎంఈఓ శివరాములు

ఆదోనిసెంట్రల్: 'ఆడుదాం–ఆంధ్ర ' పోటీలను విజయవంతం చేద్దామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈఓ శివరాములు కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నోడల్ ఆఫీసర్లు, పీడీలు, పీఈటీలు, అడ్మిన్ సెక్రటరీలతో పోటీల కార్యాచరణపై సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్, ఎంఈఓ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన ప్రారంభం కానున్న పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు.

కౌతాళం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్స్–2023ను సమష్టిగా విజయవంతం చేయాలని తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్బారాజు కోరారు.కార్యక్రమంపై గురువారం పీడీలు, పీఈటీలు, గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి జరుగు ఈపోటీల్లో అందరు పాల్గొనేలా చూడాలని చెప్పారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన దృశ్యం



కౌతాళంలో ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

ఆదోని సెంట్రల్: విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునేందుకు ప్రభుత్వం ట్యాబ్‌లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే వై. సాయి ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్ పేర్కొన్నారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అలిమ్ సిద్దిఖీ అధ్యక్షతన విద్యార్థులకు బైజూస్ కంటెంట్ ట్యాబ్‌లను విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ బడుల్లోనే చదువుకున్నానని తెలిపారు. గతంలో ఇలాంటి సౌకర్యాలు లేవని, ప్రస్తుత ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ రఘురామిరెడ్డి, డిప్యూటీ ఈఓ వెంకటరామిరెడ్డి, ఎంఈఓ శివరాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఎయిడెడ్, పురపాలక పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు 3,807 మంది ఉన్నారని తెలిపారు. విద్యార్థులు అందరికి బైజూస్ కంటెంట్ కలిగిన ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

కౌతాళం: రాష్ట్ర విద్యార్థులకు సాంకేతికి విజ్ఞానం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్యాబ్‌లు అందజేస్తున్నారని బాపురం గ్రామ ఇన్‌చార్జి గురునాథ్‌రెడ్డి, రౌడూరు గ్రామ నాయకులు సోమిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కౌతాళం సర్పంచ్ పాల్‌దినకర్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం బైజూస్ ట్యాబ్స్‌లను పంపిణీ చేశారు. స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓలు వరప్రసాద్, శోభరాణి చేతుల మీదుగా కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.



రౌడూరులో ట్యాబ్‌ల పంపిణీ చేస్తున్న దృశ్యం



బాపురంలో ట్యాబ్‌ల పంపిణీ

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు: బోరుబావులు కలిగిన రైతులు ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ కన్‌స్ట్రక్షన్ నోడల్ అధికారి యల్లప్ప సూచించారు. ఆలూరు విద్యుత్‌శాఖ ఏడీఈ నాగేంద్ర సమక్షంలో సబ్‌విడిజన్ పరిధిలోని 8 విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు అందజేసిన దరఖాస్తులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. బోరుబావులు కలిగిన రైతులు వ్యవసాయ విద్యుత్ కోసం పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్ పత్రాలను గ్రామాల్లోని హెల్పర్లకు అందజేయాలని సూచించారు. ఈ మేరకు ఏఈ, ఎల్‌ఐలు అవగాహన కల్పించాలన్నారు.

పశువుల దాణా పంపిణీ

హొళగుంద: మండలంలో కరువు పరిస్థితులు నెలకొనడంతో రిలయన్స్ ఫౌండేషన్, ఆర్డీప్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో మేకలు, గొర్రె పిల్లల యజమానులకు గురువారం ఉచితంగా దాణా పంపిణీ చేశారు. ఆర్డీప్ సంస్థ ప్రతినిధి నాగరాజు మాట్లాడుతూ కరువు పరిస్థితుల్లో జీవాల్లో రోగ నిరోధక శక్తి పెంచేందుకు దాణా పంపిణీ చేపట్టినట్లు వెల్లడించారు. గ్రామపెద్దలు సోమప్ప, రవి, మరిమల్ల, వెటర్నరీ సహాయకుడు మడివాళప్ప, రైతులు పాల్గొన్నారు.

పంటలు నమోదు చేయించుకోండి

హాలహర్వి: రైతులు రబీలో సాగుచేసిన పంటల వివరాలను ఈ–క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏఓ శివశంకర్ సూచించారు. ఈ మేరకు గురువారం మండలంలోని బాపురంలో రైతులు సాగుచేసిన వరి, జొన్న పంటలను ఆయన పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు ఈ నెల 31వ తేదీలోపు పంటల నమోదు చేయించుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది వెంట ఉన్నారు.

బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యం



ఖాజీపుర వీధిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోనిటౌన్: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సామాజిక సాధికారత కల్పించిన ఏకైక సీఎం జగనన్నేనన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం 33వ వార్డు ఖాజీపుర ఏరియాలో గడప గడపను సందర్శించారు. వీధిలోని ముస్లీం, మైనార్టీలు ఎక్కువగా ఉన్నారని, వారి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కరివేపాకులా వాడుకుని వదిలేసిందే తప్పా చేసిందేమీ లేదన్నారు. నిత్యం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్నను వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకుని రెట్టింపు పథకాలతో రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు రేణుక, మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా, నాయకులు రామలింగేశ్వరయాదవ్, శ్రీనివాసులు, అమాన్, మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి జిలేకాబీ, మల్లికవ్వ, సన్ని, తిమ్మప్ప, శ్రీదేవి, సుజాత, మహిళా విభాగం ఎస్సీ సెల్ కార్యదర్శి శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకోండి

ఆదోనిఅర్బన్: మార్కెట్‌యార్డులో రోజురోజుకు పత్తి ధర పతనమవుతుందని, ప్రభుత్వం అందజేస్తున్న గిట్టుబాటు ధరను సీసీఐ కేంద్రంలో రైతులు అమ్ముకొని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్‌యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీసీఐ కేంద్రంలో ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందని, ముందుగా రైతులు ఆర్‌బీకేలో పేర్లు నమోదు చేసుకొని సీసీఐ వారికి సాంపిల్స్ అందజేయాలన్నారు. మొదటి నాణ్యత గిట్టుబాటు ధర రూ.7,020, రెండో నాణ్యత రూ.6,090 ప్రకటించిందన్నారు. పట్టణంలోని సిరుగుప్ప రోడ్డులోని ఎన్‌డీబీఎల్ ఫ్యాక్టరీలో, ఆలూరు రోడ్డులోని జయంత్ కాటన్ ఫ్యాక్టరీలో సీసీఐ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. రైతులు ప్రభుత్వం అందజేస్తున్న గిట్టుబాటు ధరను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేత

ఆదోనిఅర్బన్: మండలంలోని మూసానహళ్లి గ్రామ ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్, ప్రింటర్ కమ్ జిరాక్స్ మిషన్‌ను అందజేసినట్లు మహాయోగి లక్ష్మమ్మవ్వ కో–ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ రాచోటి సుబ్బయ్య తెలిపారు. గురువారం పాఠశాలను సందర్శించి వాటిని అందజేశామని చెప్పారు. బ్యాంకు వైస్ చైర్మన్, డైరెక్టర్‌లు, సీఈఓ పాల్గొన్నారు.

24 నుంచి ప్రత్యేక పూజలు

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఈనెల 24 చి 26వ తేదీ వరకు హనుమద్ వ్రతం, మహా రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ వాసుదేవరావు గురువారం తెలిపారు. మంత్రాలయం మఠం పీటాధిపతి సుబుదేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు 24న హనుమద్ వ్రతం సందర్భంగా స్వామికి విశేష ఫల పంచామృతాభిషేకం, నిర్మల విసర్జనం, హనుమత్వ్రత కథ శ్రవణం, పవనమాన హోమం, అలంకారం, మహా మంగళహారతి, అన్నదానం ఉంటాయన్నారు. 26న మహా రథోత్సవం సందర్భంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, రథాంగ హోమం, అష్టోత్తరము, మహా మంగళహారతితో ప్రత్యేక పూజలు, అన్నదానం ఉంటుందని వివరించారు.

వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి సాధ్యం



సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న మనోజ్‌కుమార్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్యానర్‌కు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు సాధ్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్, పార్టీ పట్టణాధ్యక్షుడు దేవా పేర్కొన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. గురువారం పట్టణంలోని 39వ వార్డు నిజాముద్దీన్ కాలనీలో జేసీఎస్ కన్వీనర్ ఫయాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. మనోజ్‌కుమార్‌రెడ్డి, చైర్‌పర్సన్ బోయ శాంత, దేవా, వైస్ చైర్మన్ నరసింహులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వార్డులో రూ.16,62,31,000తో సంక్షేమాభివృద్ధి చేశామన్నారు.జనవరి 1వ తేదీ నుంచి పింఛన్ సొమ్ము రూ.3 వేలు పెంచుతున్న జగనన్న ప్రకటించారని చెప్పారు. సీనియర్ నాయకుడు సింహం నాగేంద్ర, సచివాలయం కన్వీనర్‌లు అబ్దుల్‌రషీద్, రామకృష్ణ, జరీనా, బోయ చంద్ర, బ్రహ్మి, నాయకులు రామంజి, జనార్ధన్, తాయన్న, వీరాంజనేయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆర్‌ఐ మహేష్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న వీఆర్‌ఏలు

పెద్దకడబూరు : ప్రజా సమస్యలు పరిష్కారంలో అందుబాటులో ఉండే వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు తిక్కన్న కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పే స్కేల్ వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందజేయాలని, ఖాళీగా ఉన్న వీఆర్‌ఓ పోస్టులను వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని కోరారు. అనంతరం ఆర్‌ఐ మహేష్‌కు వినతిపత్రం సమర్పించారు. వీఆర్‌ఏలు నాగరాజు, రంగమ్మ, ఐమావతి, భీమన్న, ఉశేని పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు చేపట్టిన సమ్మె గురువారానికి పదో రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు వరలక్ష్మి, జానకి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు పద్మ, రేణుక, సరోజ, సోమక్క, గీత, వీరమ్మ, మీనాకుమారి, రిజ్వాన, శారద, ఈరమ్మ పాల్గొన్నారు.

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

ఆదోనిరూరల్: కరువుతో అల్లాడిపోతున్న రైతులను, కౌలు రైతులను, వ్యవసాయ కూలీలను తక్షణమే ఆదుకోవాలని రైతుసంఘం వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండలంలోని గణేకల్, కుప్పగల్, జాలిమంచి, ధణాపురం తదితర సచివాలయాల ఎదుట ధర్నా నిర్వహించి సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితుల నెలకొని పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. దిగుబడి పూర్తిగా తగ్గిపోయి రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిపై ఆధారపడిన వ్యవసాయ కూలీలు మరింత నష్టపోయారన్నారు. పత్తికి ఎకరాకు రూ.50 వేలు పంట నష్టపరిహారం ఇవ్వాలని, పశువులకు పశుగ్రాసం అందించాలని కోరారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు కె.శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రంగనాథ్, నాయకులు గోవింద్, హనుమంతరెడ్డి, బాషా, వెంకటేశ్, కమలనాథ్ పాల్గొన్నారు.